
మనిషిని మనిషి
చంపుకునే
ఈ రోజుల్లో
బ్రతుకుమీద
ఆశవుండదా?

# దేవుడా రక్షించు




"నో... ఇంపాజిబుల్... అలా జరగడానికి వీల్లేదు. విశ్వం... నా విశ్వం... బ్రతికే వున్నాడు. చెప్పండి... నా విశ్వం బ్రతికే వున్నాడని చెప్పండి. చెప్పరేం...? ఒక్కరు! ఒక్కరైనా చెప్పరేం...! నా విశ్వం బ్రతికే వున్నాడు... కదూ...!"

ఏవండీ...!

నాన్నా...!

మామయ్యా...!

తాతయ్యా...!

నా భార్య, కొడుకు, కూతురు, అల్లుడు కోడలు, మనవడు, మనవరాలు నా చుట్టూ చేరి నేనేమైపోతానోనని, నాకేమైపోతుందోనని విలపిస్తున్నారు.

"ఎందుకు...? మీరంతా ఎందుకు ఏడుస్తున్నారు? నాకేమైంది...! నాకేం కాలేదు.. వెళ్లండి... నాకేమీ కాకపోవడమే నా దురదృష్టం... వెళ్లండి..." దిక్కులు పిక్కటిల్లేటట్లు అరిచాను. నా కసలే పిచ్చికోపం.

"గ్రాండ్ పా! ప్లీజ్ హేవ్ ఇట్..." పదేళ్ల మనవడు లెమన్ జ్యూస్ గ్లాసు నా నోటికందిస్తున్నాడు. వాడు ఎప్పట్నుంచి ఏడుస్తున్నాడో...!

మనవడు అందించిన జ్యూస్ గ్లాసు తీసుకొని కిందపెట్టి వాడి లేతబుగ్గలమీది కన్నీటి చారికలు రెండు చేతులలో తుడిచి "ఒరేయ్ కన్నా! చెప్పరా... విశ్వం తాతయ్య చనిపోలేదని చెప్పరా...! బాలవాక్కు బ్రహ్మవాక్కురా..." అడిగాను.

వాడు తన చిట్టి చేతులతో నా కన్నీరు



తుడిచి "అయామ్ సారీ గ్రాండ్ పా..." అన్నాడు.

అంతవరకూ గుండె గదిలో మిణుగురు పురుగులా రెపరెపలాడుతున్న ఆశ ఆ బాలవాక్‌తో హరించుకుపోయింది.

విశ్వం నా శ్వాస. విశ్వం నా ప్రాణం.

ఎలిమెంటరీ స్కూలు దగ్గర్నుంచి కలిసి చదువుకున్నాం. కలిసి తిరిగాం. ఒక కంచం

లో తిన్నాం. ఒక మంచంమీద నిద్రపోయాం. ప్రాణానికి ప్రాణంగా మెలిగాం. ఎక్కడ చూసినా మేమిద్దరమే. ఎక్కడికెళ్ళినా మేమిద్దరమే. చూసేవాళ్ళు, తెలియనివాళ్ళు "మీరిద్దరూ అన్నదమ్ములా...?" అని అడిగేవారు. "కాదు. స్నేహితులం ప్రాణ స్నేహితులం..."అని చెప్పేవాళ్ళం.

బి.ఎలో విశ్వం పొలిటిక్స్, నేను హిస్టరీ మెయిన్ తీసుకున్నాం.

చదువు అనేది ఉద్యోగం కొసం కాదు, విజ్ఞానం కోసమని నమ్మేవారిలో మేమిద్దరం.

ఎమ్.ఎ అయ్యాక విశ్వం రాజకీయాల్లోకి చేరాడు. నేను పిహెచ్‌డి చేద్దామని నిర్ణయించుకున్నాను.

నాకన్నా విశ్వం చలాకి. గడుసు. వాడిలో లీడర్‌షిప్ క్వాలిటీస్ చాలా వున్నాయి. తన వాగ్ధాటితో, వాక్‌చాతుర్యంతో ఎదుటివారిని మంత్రముగ్ధుల్ని చేయగల మెస్మరిజం తనలో వున్నాయంటే అతిశయోక్తి కాదేమో!

విశ్వం నామినేషన్ వేసేముందు నా దగ్గరికి వచ్చాడు. నా ఆశీర్వాదములు వాడికి కావాలట! నేను నవ్వాను వాడి పిచ్చి నమ్మకానికి. ఇద్దరం ఒకే వయసువాళ్ళం.

విశ్వం నన్ను బిగియార కౌగిలించుకుని "ఒరేయ్! నువ్వు నా స్నేహితుడివేకాదు... శ్రేయోభిలాషివి..." అన్నాడు. వాడి కన్నుల్లో సన్నటి నీటి తెర.

"ఈ రాజకీయాలు కుళ్ళు, బురద. దిగి నీ క్యారెక్టర్ని పాడు చేసుకుంటున్నావేమో...!" వాడి భుజం తట్టి అన్నాను.

"చిన్నగా నవ్వి ఈ కుళ్ళు రాజకీయాల గురించి నాకు తెలియకనా... తెలుసు. మనం నిజాయితీగా వున్నంతవరకూ ఏ కుళ్ళూ మన దరిదాపులకి రాదు..." దృఢంగా అన్నాడు.

వాడి పేదవులమీద చెరగని చిరునవ్వు— దేవుడిచ్చిన వరం. కోపం రావడం నేను ఎప్పుడూ చూడలేదంటే నమ్మరేమో!

కాల చక్రం గిర్రున తిరిగింది. ఇరవై అయిదు సంవత్సరాలు తనలో కలిపేసుకున్నాడు కాల పురుషుడు. ఈ కాల గమనంలో ఎన్ని మార్పులు... ఎన్ని తీర్పులు...! ఎన్ని విజయాలు...! ఎన్ని అపజయాలు...!

నేను యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా స్థిరపడ్డాను.

విశ్వం ఒక సాధారణ ఎమ్మెల్యేనుండి చీఫ్ మినిస్టర్ అయ్యాడు. తర్వాత ఎం.పీగా పోటీచేసి గెలిచి సెంట్రల్ మినిస్టర్ అయ్యాడు. ఆ తర్వాత అధికార పార్టీలో గొడవలు వచ్చి స్వతంత్రించి జాతీయస్థాయిలో పార్టీపెట్టి ఎన్నికల్లో అనూహ్యారీతిలో మెజార్టీ సాధించి ప్రైమ్ మినిస్టర్ అయ్యాడు. తరువాత ఎన్నికల్లో తన పార్టీ మెజార్టీ కోల్పోయింది. రెండు సంవత్సరాల్లో మధ్యంతర ఎన్నికలు.

వినేవాళ్ళకి ఒక కథలా ఉండొచ్చు. సినిమాలా ఉండొచ్చు. కాని ఇది నిజం. తన నిజాయితీతో, కార్యదక్షతతో అంత ఎత్తుకు విశ్వం ఎదిగాడంటే ఎవ్వరూ నమ్మకపోవచ్చు. కాని **నమ్మాలి.** అందుకు నిదర్శనం నేను. సాక్ష్యం **నేను.**

విశ్వం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకార

ం చేసినపుడు నేను పక్కనే వున్నాను.

మనిషికి డబ్బు ఉంటే చాలదు. అధికారం వుండాలి.

విశ్వం ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధిపరిచాడు. స్కూళ్లలో, కాలేజీల్లో డొనేషన్లు రద్దుచేయించాడు. చదువు 'కొన' రాదు. చదువు 'కోవాలి' అనేవాడు. రిటైర్మెంట్ వయసు పెంచాడు. వృద్ధాప్యపు పెన్షన్, నిరుద్యోగ భృతి ప్రవేశపెట్టాడు. టూరిజం డెవలప్ చేసాడు. ఇంకా... చాలా చాలా చేసాడు. ముఖ్యంగా కులవృత్తి చేసుకుంటున్న దేవదాసీలను, దేవదాసీలమని చెప్పుకొని వ్యభిచారం చేస్తూ సమస్త రోగాలతో కుళ్లిన శరీరాలతో అతి దయనీయంగా బ్రతుకుతున్నవాళ్లకి జీవనోపాధి కల్పించి, పునరావాసం ఏర్పరచాడు. ఈ విషయంలో నా విశ్వం ఎన్నో విమర్శలకి గురికావలసి వచ్చింది. ''ప్రజల సొమ్ము పతితలకి ధారపోస్తున్న ముఖ్యమంత్రి'' అని హేళన చేసారు. అయినా మనిషి చలించలేదు. మనసు మారలేదు.

విశ్వం భుజం తట్టి చిన్న సలహా ఇచ్చాను.

''కులాంతర వివాహాలు చేసుకున్నవారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తే...?''

''ఆ విషయంలో చాలా అవరోధాలు వున్నాయి. 'లాండ్ సీలింగ్'లో ఆస్తి కాపాడుకొనేందుకు భార్యాభర్తలు కోర్టులో విడాకులు చేసుకొని నిర్లజ్జగా ఒకే ఇంట్లో కాపురం చేస్తున్న పుణ్యభూమి మనది. ఆ నైతిక పతనం నుంచి మనిషిని మేల్కొలిపేది సామాజిక చైతన్యం, సాంకేతిక విజ్ఞానం. ముందుగా మత మౌఢ్యంనుంచి మనిషిని బయటికి లాగాలి. అందుకు మనమంతా కృషి చేయాలి...'' నవ్వుతూ చెప్పాడు విశ్వం.

ఎంత చక్కని అవగాహన! ఎంత లోతుగా ఆలోచించాడు!! నిజానికి అటువంటి ఆలోచన నాకు తట్టనేలేదు.

రాష్ట్రంలో నక్సలైట్ల కార్యకలాపాలు



## కోరిక!

ఉరితీయబోయే వ్యక్తిని ''నీ ఆఖరి కోరిక ఏమిటి'' అని అడిగాడు జైలర్.

''నా భార్య పసుపు కుంకుమల్ని కాపాడండి జైలర్''

''ఆ....''

—బి. వెంకటరామిరెడ్డి (నాగినేనిప్రోలు)

ఎక్కువయ్యాయి. వాళ్లు ఏవేవో కోరుతున్నారు. అవి సమంజసంగా లేవని ప్రభుత్వం

ఒకసారి నక్సలైట్లు నన్ను కిడ్నాప్ చేసారు పోలీసులు అరెస్టు చేసిన తమ ఇద్దరు నాయకుల్ని విడుదల చేయమని వాళ్ల డిమాండ్. అప్పటికి విశ్వం ఢిల్లీలో వున్నాడు. ఈ విషయం తెలిసి ఆఘమేఘాలమీద వచ్చాడు. ఒంటరిగా ఎటువంటి సెక్యూరిటీ లేకుండా నా కోసం, నన్ను కాపాడ్డంకోసం నక్సల్స్ స్థావరానికి వచ్చాడు.

''నక్సలైట్ల చేతుల్లో ముఖ్యమంత్రి కీలుబొమ్మ''

''అవినీతి, బంధుప్రీతితో రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న ముఖ్యమంత్రి.''

మరుసటిరోజు పేపర్లో హెడ్‌లైన్స్. ప్రతిపక్షాల విమర్శలు.

విశ్వం వాటిని చాలా ఈజీగా తీసుకొని చిరునవ్వుతో ఇలా అని అందరి నోళ్లు మూయించాడు.

''ఈ ప్రజలు నా మీద నమ్మకం కలిగి నన్ను గెలిపించి అధికారాన్ని ఇచ్చారు. నేను వారి ఆస్తిపాస్తులు, మానప్రాణాలు కాపాడే సెక్యూరిటీ గార్డుని. వారి విశ్వాసాన్ని నమ్మును చేయను... చేయలేను...''

కాసే చెట్టుకే రాలిదెబ్బలు. నడిచే ఎద్దుకే కొరడాదెబ్బలు. పనిచేసే వ్యక్తికే తిట్లు, శాపనార్థాలు.

నాయకులంతా విశ్వంలాగే నిజాయితీతో, పట్టుదలతో పనిచేస్తే దేశం ఏనాడో సస్యశ్యామలంగా విరాజిల్లేది.

తర్వాత అధికార పార్టీవాళ్లతో గొడవలు వచ్చి తనే జాతీయస్థాయిలో పార్టీ పెట్టి ఊహించని రీతిలో మెజారిటీ సాధించి ప్రధానమంత్రి అయ్యాడు.

ఏరంగంలోనైనా మనిషి ఎదుగుతున్నాడంటే అతనికి మిత్రులకన్నా శత్రువులే ఎక్కువగా వుంటారు.

అందరికళ్లూ విశ్వం మీదే. ప్రపంచంలోనే అతి పెద్ద శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశానికి ఇంత చిన్న వయసులో ప్రధాని కావడం విశేషం. అగ్రనేతల కళ్లు ఎంతో ఆసక్తితో విశ్వాన్ని పరికించాయి.

ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే నా దగ్గరికి వచ్చాడు. వాడి రాకకి ఆశ్చర్యపోయాను. ఆనందంలో ఉక్కిరిబిక్కిరి అయ్యాను. నిన్నటివరకూ విశ్వాన్ని ''ఒరేయ్...'' అని పిలిచేవాడ్ని. ఇప్పుడు ఏమని పిలవాలో తెలియక ''రండిసార్...'' అని ఆహ్వానించాను.

విశ్వం చెరగని చిరునవ్వుతో నన్ను తన హృదయానికి హత్తుకొని ''నేను ప్రధానమంత్రినే కావచ్చు. కాని... అంతకుముందు నీ మిత్రుణ్ని. నన్ను ''ఒరేయ్ ! విశ్వం!'' అని పిలవరా...'' అన్నాడు.

దేశంలో ఎన్ని సమస్యలు...! పంజాబ్‌లో ఉగ్రవాదం, కాశ్మీర్‌లో మతోన్మాదం. ఇలా ప్రతి రాష్ట్రంలో ఏదో సమస్య. ఇవి చాలవన్నట్లు మండల్ కమిషన్. బాబరీ మసీదు.

జాతీయ సమస్యలతో సతమతమవుతుంటే అంతర్జాతీయ సమస్యలొకటి పుండుమీద కారం జల్లినట్లు. అన్ని దేశాల కళ్లు మన దేశంమీదే...! ఏ క్షణాన ఏమవుతుందో

తెలియని పరిస్థితి.

దేశమంతా రిజర్వేషన్ల మంటలు రాజుకున్నాయి. రైళ్లు, బస్సులు, కార్యాలయాలు తగలబెడుతున్నారు. ఒక మతంవారిని ఇంకో మతంవారు నరుక్కుంటున్నారు.

"సామాజిక సమస్యకు రాజకీయాల రంగు పులిమి, విద్యాలయాలను, ఉద్యోగరంగాన్ని సామాన్య ప్రజా జీవితాన్ని భ్రష్టు పట్టించారు. వెనకబడ్డవారిది ఆర్థిక సమస్య. వారిని లేవనెత్తేందుకు ప్రతిభ నెత్తిమీద మేకులు దింపనక్కరలేదు."

ఈ విషయమే విశ్వంతో అన్నాను.

"నిజమే. ఆలోచించేవాడు చేయలేక పోతున్నాడు. చేసేవాడు ఆలోచించడంలేదు. ఏది చేద్దామన్నా కాలం కలిసిరావాలి. ఏ సమస్య అయినా ఒక్కరివలన కాదు. అందరి సహకారం కావాలి. ఉద్రేకానికి లోనుగాని ఇన్‌ఫార్మ్‌డ్ పబ్లిక్ ఒపీనియన్ ఎప్పుడూ శిరోధార్యం..." భారంగా నిట్టూర్చి అలసటగా కనులు మూసుకున్నాడు విశ్వం.

ఎంతగా అలసిపోయాడు. కనీసం రోజుకి ఒక్క గంట అయినా నిద్రపోతున్నాడో! లేదో!

"దేశంలో రెండురోజులకోసారి అన్నం తినేవాళ్లు లక్షలమీద వున్నారు. కనీసం వాళ్లకి రోజుకి ఒక్క పూటైనా అన్నం పెట్టగలిగి వుండాలి".

విశ్వం ఎంతగా ఎదిగిపోయాడు! దేశం నాకేమిచ్చింది? అని కాకుండా దేశం కోసం నేనేం చేసానన్నదే తపన. ఆరాటం.

"పబ్లిక్ మెమరీ ఈజ్ షార్ట్."

దేనికోసం, ఎవ్వరికోసం ఆగని కాలచక్రం తిరుగుతూనే వుంది. సమస్యలు సమస్యలుగానే వున్నాయి. మరలా ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో ఓ కలగూరగంప-- మెజారిటీ సాధించింది. అధికారాన్ని చేపట్టింది.

ప్రజాసేవ అంటూ పదవికోసం ప్రాకులాడే నాయకులు, వినాయకుల్లో గొడవలు. ప్రధాని పదవికోసం పిచ్చికుక్కల్లా కరుచుకు

•

## కోతులే నయం



"కోతి నుంచి పుట్టాడూ.... మానవుడూ!" అంటూ మనం పాడుకుంటూ ఉంటాం! ఇదెంత వరకూ నిజమో తెలియదుకానీ... మనలో నశిస్తున్న మానవత్వపు విలువలు ఇంకా కోతులలో ఉన్నాయంటే మీరు నమ్మగలరా? ఒక గుంపుగా ఉన్న కోతులలో ఒక కోతికి జబ్బు చేసినపుడు... దానికోసం మిగిలిన కోతులు తమ ఆహారాన్ని త్యాగం చేస్తాయట! మీరు నమ్మినా నమ్మకపోయినా.. ఇది జంతుశాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా నిరూపించిన వాస్తవం!!

హాపీటర్.

న్నాయి. తత్ఫలితంగా ఆ కలగూర గంపలో చీలికలు ఏర్పడ్డాయి. దేశ సుస్థిరతకు భంగం కలిగింది. మధ్యంతర ఎన్నికలు తప్పనిసరయ్యాయి.

దేశమంతా ఎన్నికల సందడితో నిండుకుంది. రాజకీయ నాయకులంతా శుష్క వాగ్దానాలతో బరిలోకి దిగి జబ్బలు, తొడలు చరుస్తున్నారు. హత్యలు, దౌర్జన్యాలు, దోపిడీలు నిరాటంకంగా జరిగిపోతున్నాయి. ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని జీవిస్తున్నారు.

విశ్వం రాత్రనకా, పగలనకా నిద్రాహారాలు మరచి దేశమంతా సుడిగాలిలా తిరుగుతున్నాడు. ఎక్కడ చూసినా వాడే...! ఎవరి నోట విన్నా వాడే...!

విశ్వం నిన్న విశాఖ బహిరంగసభలో ప్రసంగించి మద్రాస్ బయలుదేరాడు. కూడా నన్ను రమ్మన్నాడు. కాని ఆరోగ్యం సరిగా లేక వెళ్లలేకపోయాను. అదే నా దురదృష్టం.

ఎయిర్‌పోర్ట్‌లో అరగంటపైగా కూర్చుని మాట్లాడుకున్నాం.

"ఈసారి ఎన్నికలంటే ప్రతి ఒక్కరికీ భయంగా వుంది. ఏ క్షణాన ఏమవుతుందో తెలియదు. ముఖ్యంగా నీ విషయంలో చాలా భయంగా వుందిరా... ఇంత చిన్న వయసులో అంత ఎత్తుకి ఎదిగావ్..." కంట నీరు పెట్టుకున్నాను.

విశ్వం తన హస్తాలతో నా కన్నీరు తుడిచి ఎంతో ఆప్యాయంగా నా నుదుట ముద్దు పెట్టుకున్నాడు.

"నోటితో నవ్వి నొసటితో వెక్కిరిస్తే రాజకీయం. ఒక చేతితో అభివాదం చేసి మరో చేత్తో చీల్చి చెండాడడం ఉగ్రవాదం. ఏ నిమిషాన్న ఏమవుతుందోనని భయం వుంటుంది. 'ఆ! ఏమీ కాదులే' అనే ధీమా వుంటుంది. మా వైపు ఎప్పుడూ కత్తులు, తుపాకులు గురిపెట్టి వుంటాయి. అయినా తప్పదు. నిజంగా ఎవరైనా నా ప్రాణాలు తీయాలని అనుకుంటే ఏమంత కష్టం— కాదు. హంతకుడు నా ప్రాణానికి తన ప్రాణాన్ని పణంగా పెట్టినట్లయితే ఫినిష్...'
' అని నవ్వాడు.

వాడి పెదవుల మీద చెరగని చిరునవ్వు దేవుడిచ్చినవరం.

రాత్రి పదకొండు గంటలకి మద్రాస్‌లో కార్యకర్తల, అభిమానుల కేరింతల మధ్య నా విశ్వం మృత్యువాతపడ్డాడు.

ఉగ్రవాదుల హింసాత్మక చర్యలకి నా విశ్వం బలైపోయాడు.

ఉన్మాదుల పిచ్చి చేష్టలకి నా విశ్వం ప్రాణాలు కోల్పోయాడు.

ఎందుకీ హత్యలు...? ఎవరి కోసం ఈ మారణహోమం...?

ఎందుకీ రాక్షసక్రీడ...? ఎవరు చెప్పారు మనిషిని మనిషి చంపుకోమని.

దేవుడా! చూడవయ్యా! ఇదీ మా సంస్కృతి. దేశ నేతలను పొట్టన పెట్టుకొనే సంస్కృతి.

ఆనాడు బాపూజీని, తర్వాత ఇందిరాగాంధీని, మొన్న రాజీవ్‌గాంధీని, నేడు విశ్వాన్ని ఉన్మాదులు బలి తీసుకున్నారు.

ఇలా మనిషిని మనిషి చంపుకుంటూపోతే ఈ భూమ్మీద జీవించేది ఎవరు...?

'దేవుడా! మాకొద్దు ఈ మానవ జన్మ...'

"దేవుడా! రక్షించు!!"

[ "అతని పెదవులమీద చెరగని చిరునవ్వు దేవుడిచ్చిన వరం. చిరునవ్వులో సిరివెన్నెల కురిపించే మా రాజీవ్‌గాంధీగారికి భాష్పాంజలితో..." రచయిత]

